క్లుప్తంగా

సజావుగా పదో తరగతి పరీక్ష

యాడికి: మండల కేంద్రంలో గురువారం 4 కేంద్రాల్లో పదో తరగతి సైన్స్ పరీక్ష సజావుగా జరిగింది. మొత్తం 906 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 886 మంది హాజరైనట్లు ఎంఈఓ కాశెప్ప తెలిపారు. ఉన్నత పాఠశాలలోని ఏ,బి, వాగ్దేవి, ప్యారడైజ్ పరీక్ష కేంద్రాలను ఎంఈఓ కాశెప్ప, యాడికి ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

ప్రభుత్వాస్పత్రికి బెంచీల వితరణ



ఆసుపత్రి వైద్యాధికారికి బెంచీలను అందజేస్తున్న దాత

గుత్తి రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రికి పట్టణానికి చెందిన జీకే బ్రాడ్ బ్యాండ్ ఇంటర్నెట్ నిర్వాహకుడు జీకే.కృష్ణయ్య తన తండ్రి దివంగత వెంకటేష్ జ్ఞాపకార్థం బెంచీలను ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ యల్లప్పకు బెంచీలను దాత కృష్ణయ్య అందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని పురుషుల వార్డు డాబా పైకి ఎక్కేందుకు రూ.10 వేలు విలువ చేసే నిచ్చెనను పట్టణంలోని న్యూ అన్నపూర్ణ హోటల్ యజమానులు శివప్రసాద్, రవికుమార్ అందజేశారని వైద్యాధికారి తెలిపారు. హెడ్ నర్స్ నాగమణి, స్టాఫ్ నర్స్ వరలక్ష్మి, సిబ్బంది రాజేష్, రమణ పాల్గొన్నారు.

ఉచిత పాలిటెక్నికల్ కోచింగ్

గుంతకల్లుటౌన్: పాలిటెక్నికల్, ఏపీఆర్‌జేసీ పరీక్షలు రాయనున్న టెన్త్ విద్యార్థులకు వివేకానంద స్కూల్‌లో ఉచితంగా షార్ట్‌టర్మ్ కోచింగ్ నిర్వహించనున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ ఓంకారప్ప గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు క్లాసులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం కొత్త బస్టాండ్ నుంచి ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9705555449, 9963876741 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లోకేష్ పాదయాత్రలో తపాలా ఉద్యోగి



పాదయాత్రకు హాజరైన రమణారెడ్డి

యాడికి : రాయలచెరువులో బుధవారం జరిగిన యువగళం పాదయాత్ర బహిరంగ సభకు లక్షుంపల్లె తపాలా ఉద్యోగి హాజరయ్యాడు. టీడీపీ నాయకుడు చలమారెడ్డితో కలిసి అదే గ్రామానికి చెందిన తపాలా ఉద్యోగి రమణారెడ్డి తన తపాలా విధులను పక్కన పెట్టి టీడీపీ నాయకులతో నారా లోకేష్ పాల్గొనే బహిరంగ సభకు హాజరు కావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బాధితుడికి ఆర్థిక సాయం

పుట్లూరు: ఏ.కొండాపురం గ్రామ సమీపంలో ఈ నెల 10న లారీ ఢీ కొనడంతో కడవకల్లు వీఆర్ఓ పెద్దన్న తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. ఇతన్ని కర్నూలు ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. కాగా ఇతడి తలకు తీవ్రంగా గాయాలు కావడంతో బెంగళూరుకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి పెద్దన్న వైద్యం కోసం రూ.20 వేలు అందజేశారు. ఈయనతో పాటు మండల అధికారులు, సచివాలయ సిబ్బంది వీఆర్ఓ వైద్యం కోసం ఫోన్‌పే ద్వారా తమ వంతు సాయం అందజేస్తున్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తాడిపత్రి టౌన్: పట్టణంలోని 15వ వార్డు లలితా మెగా మాల్ వద్దనున్న కాలనీలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి. అలాగే పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉదయం 8 గంటలకు, బుగ్గ సర్కిల్ వద్ద ఉదయం 8:30 గంటలకు జరిగే అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న సంజీవరాయుడు

గుంతకల్లుటౌన్: సెల్‌ఫోన్ వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే టెలికామ్ నియంత్రణ సాధికార సంస్థ (ట్రాయ్) లక్ష్యమని సంస్థ కాగ్ సభ్యుడు డాక్టర్ బత్తుల సంజీవరాయుడు తెలిపారు. గురువారం స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ట్రాయ్ అందిస్తున్న సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశీయ టెలికామ్ రంగాన్ని ప్రోత్సాహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

జగనన్న పాలనలో అర్హులకు న్యాయం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



సంక్షేమ లబ్ధిని వృద్ధురాలికి వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. స్థానిక 15వ వార్డు పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో రెండో రోజు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని హేమాద్రి గెస్ట్ హౌస్ వద్ద ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఘన స్వాగతం పలికారు. వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు పక్కీరప్ప, నాగాంజనేయులు(ఆంజి)లతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే వాటిని పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఇంటి ముంగిటకే పథకాలు అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రవేశపెట్టారన్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన సొమ్మును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయడంతో అవినీతి లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో మరోసారి సంక్షేమ పాలన కావాలంటే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్లు రాఘవేంద్ర, చిన్ననాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు బాబు, వరదలయ్య, శ్రీనివాసులు(శీనా) నాయకులు అంబటి రాఘవరెడ్డి, ఆకుల పెద్దనాగిరెడ్డి, జావీద్, పరమేష్, హరినాథరెడ్డి, వేణు, అన్వర్, మాబాషా(ఘోరా), ఓబుళేసురెడ్డి, మనోజ్ కాశీ, నాగభూషణం,దూల రఘు, సునిల్, విజయ్‌కుమార్, పాపరాయుడు, కంబగిరి, రామాంజనేయులు, శివ మహేష్, మున్సిపల్ డీఈ వెంకటసుబ్బయ్య, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి

- రైల్వే సహాయ మంత్రికి ఎమ్మెల్యే వైవీఆర్ వినతి



రైల్వే మంత్రి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: రైల్వే సమస్యలు పరిష్కరించి పట్టణాభివృద్ధికి సహకరించాలని రైల్వే సహాయ మంత్రి రావుసాహెబ్ పాటిల్ దన్వేకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ఎమ్మెల్యే గుంతకల్లుకు విచ్చేసిన రైల్వే సహాయ మంత్రిని కొనగి గెస్ట్‌హౌస్‌లో కలిసి రైల్వే సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ధర్మవరం లెవల్ క్రాసింగ్ గేట్ (డీఎంఎం), కసాపురం రైల్వే బ్రిడ్జి, హనుమన్ సర్కిల్‌లోని మరో లెవల్ క్రాసింగ్ గేట్లు అడ్డంకిగా మారాయన్నారు. ఈ ఎల్‌సీ గేట్లు ఎత్తివేయాలని, కసాపురం బ్రిడ్జి వంతెనను విస్తరించాలని, హనుమన్ సర్కిల్‌లోని బళ్లారి రోడ్డులో మరో రైల్ అండర్ బ్రిడ్జి కోసం అనేకమార్లు జోనల్, డివిజన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రస్తుతం ధర్మవరం గేట్ తొలగింపునకు, కసాపురం రోడ్డు విస్తరణకు మున్సిపల్, ఆర్అండ్‌బీ, రైల్వే అధికారులు సర్వేలు కూడా చేశారని గుర్తుచేశారు. రోటరీ హైస్కూల్-ఎస్‌జేపీ ఉన్నత పాఠశాల సమీపంలో కల్లూరు-గుంతకల్లు రైలు మార్గం ఉందని, నిత్యం ఈ రైలు పట్టాలు దాటుకుంటునే విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. పట్టణాభివృద్ధికి అంటకాలుగా మారిన ఈ సమస్యలను పరిష్కరించాలని ఆయన విన్నవించారు. ఈ విషయమై రైల్వే సహాయ మంత్రి సానుకులంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కల్యాణ మండపానికి స్థలం కేటాయించండి

పట్టణంలోని శాంతినగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం సమీపంలోని రైల్వేస్థలంలో కల్యాణ మండపం నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు సంపత్‌కుమార్ ఆచారి, కార్యదర్శి ఆదినారాయణ రైల్వే సహాయ మంత్రికి వినితి పత్రం అందజేశారు. ఈ విషయమై మంత్రి ఏర్పాటుకు సానుకులంగా స్పందించినట్లు వారు తెలిపారు.

డీఐజీ, ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే



డీఐజీ అర్ఎన్. అమ్మిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి , ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అనంతపురం రేంజ్ డీఐజీ, ఎస్పీని గురువారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి డీఐజీ కార్యాలయంలోని డీఐజీ ఆర్ఎన్.అమ్మిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్పీ కార్యాలయంలోని ఎస్పీ కంచి శ్రీనివాసరావుకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. శాంతిభద్రతల విషయంలో ఎవరిని ఉపేక్షించకూడదని, అందుకు తమ సహకారం ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

బుక్కరాయసముద్రం: ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి శుక్రవారం మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్ తెలిపారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే ఉదయం 10 గంటలకు పూల మాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం కొర్రపాడు వద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సీఎం సభ విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: నార్పలలో ఈ నెల 17న జరిగే ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన సభను విజయవంతం చేద్దామని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ పార్వతి, సచివాలయ కన్వీనర్ బయపరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

గార్లదిన్నె: నార్పలలో ఈనెల 17 జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి కోరారు.గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం పర్యటనపై వైఎస్సార్ సీపీ నాయకులు,కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆలూరి సాంబశివారెడ్డి హాజరై మాట్లాడుతూ మండలం నుంచి నాయకులు, అభిమానులు, పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా చూడాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్ర, ఎంపీపీ వెంకటనారాయణ, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి, పాలిఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరంధామ తదితరులు పాల్గొన్నారు.

నార్పల: ఈ నెల 17న నార్పలలో తలపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు. అంతకుముందు ఆయన సభా స్థలం, హెలీప్యాడ్ స్థలాన్ని ఆయన పరిశీలించారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, సొసైటీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, దాడితోట బాషా, వెంకటరామిరెడ్డి, రాంభూపాల్, రంగారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : నార్పలలో ఈనెల 17న జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరి సాంబశివారెడ్డి కోరారు.గురువారం స్థానిక వాసవీకల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలం నుంచి నాయ కులు, అభిమా నులు, పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మన శ్రీరామ రెడ్డి, ఎంపీపీ యోగీశ్వరీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పట్నం నగేష్, గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ నర్సయ్య, తరిమెల సర్పంచు రాజమోహన్ రెడ్డి, తరిమెల భాస్కర్ రెడ్డి, ఎన్వీ నారాయణ, నూర్ మహమ్మద్, మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే ఏపీకి బంగారు భవిష్యత్తు



యాడికిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఆంధ్రప్రదేశ్‌కు బంగారు భవిష్యత్తు సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం పాత కొత్తచెరువు, పులగుట్టపల్లి, పెద్ద తండా, జీ.కొట్టాల, అయ్యవారుపల్లి, ఇమాంపురం, కసాపురం, దోసలుడుకి, మొలకలపెంటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ నవరత్నాల పథకంతో పేద ప్రజలకు ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్ ఆధ్వర్యంలో పాతకొత్త చెరువు, మండల సచివాలయ కన్వీనర్ గోవిందు నాయక్ పులగుట్టపల్లి పెద్దతండాలో కార్యక్రమం నిర్వహించారు.

పామిడి: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి సమన్వయంతో పనిచేయాలని మండల సచివాలయాల పట్టణ, రూరల్ కన్వీనర్లు బీ ఆసిఫ్, ఎం కుమార్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూధన్‌రెడ్డి అన్నారు. పామిడితో పాటు గ్రామాల్లో గురువారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ టీ రామకృష్ణారెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గౌరప్ప, జోజోడే కుమార్, ఓబులేసు, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

యాడికి: మండల కేంద్రంలో గురువారం ఎంపీపీ బొంబాయి ఉమాదేవి ఆధ్వర్యంలో ఎంపీటీసీ నాగరాజు, సచివాలయ గృహసారథులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. తూట్రాళ్లపల్లెలో సర్పంచు సంజీవరాయుడు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. సచివాలయ మండల కన్వీనర్ శివప్రసాద్, నాయకులు ఫరూక్, దూద్ వలి, చౌదరి పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదాతలను సత్కరిస్తున్న దృశ్యం

పామిడి: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది రక్తదానం చేశారు. అనంతరం తహసీల్దార్‌తో పాటు సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ షేక్ చాంద్‌బాషా, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ హరిప్రసాద్ జేవీవీ మండలాధ్యక్షుడు బంగారు శీనా, కార్యదర్శి ఓబిరెడ్డి తదితరులు అభయ బ్లడ్ డోనర్స్ సంస్థ అధ్యక్షుడు ఫకృద్దీన్, షామీర్, లక్ష్మణ్, సాయిప్రియకు రాష్ట్రస్థాయి మహనీయుల పురస్కారంతో సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, సీఎస్‌డీటీ వెంకటేశ్వరమ్మ, ఆర్ఐ క్రాంతికుమార్, వీఆర్వోలు శ్రీకాంత్‌రెడ్డి, ముత్యాలు, భాగ్య, సునితబాయి, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

గుత్తి రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా గురువారం ఆర్టీసీ బస్సు-లారీ ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. స్థానికులు వివరాల మేరకు.. ఆదోని నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎదురుగా వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి లారీని ఢీకొంది. ప్రమాదంలో లారీ అద్దాలు ధ్వంసమయ్యాయి. లారీని ఢీ కొన్న సమయంలో ఆర్టీసీ బస్సులో సుమారు 40 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఏం జరుగుతోందని ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు. నడిరోడ్డుపై బస్సు, లారీ నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ అయింది. నడి రోడ్డుపై వాహనాలను ఆపి బస్సు, లారీ డ్రైవర్లు వాగ్వాదం చేసుకుంటుండటంతో స్థానికులు కల్పించుకొని ఇద్దరికి సర్ది చెప్పి పంపేశారు.

నీటి సమస్యలు పరిష్కరించండి



18వ వార్డులో బోరు పాయింట్‌ను పరిశీలిస్తున్న నైరుతిరెడ్డి, ఏఈలు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 18, 30 వార్డుల్లో నెలకొన్న నీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆమె ఆయా వార్డుల్లో పర్యటించారు. కొన్ని నెలల క్రితం చెడిపోయిన మోటార్‌తో నీటి సరఫరా జరగడం లేదని, దీంతో కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని వార్డు కౌన్సిలర్లు మాచర్ల సుజాత, చాముండేశ్వరి తెలిపారు. రెండు చోట్ల కొత్త మోటార్లను అమర్చి నీటి సమస్యను పరిష్కరించాలని వైస్ చైర్‌పర్సన్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అలాగే అనిబిసెంట్ మున్సిపల్ స్కూల్‌లో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. ఏఈ శ్రీకాంత్, వార్డు ఇన్‌చార్జ్‌లు మాచర్ల శివ, హరి పాల్గొన్నారు.

జగనన్న చలవతోనే యాడికి కాలువకు నీళ్లు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యాడికి: యాడికి కాలువకు నీళ్లు రావడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలవేనని, ఇందుకు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవ తోడైందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. నాడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అధికారంలో వచ్చిన వెంటనే గార్లదిన్నె మండలం నుండి యాడికి వరకు ఉన్న యాడికి కాలువలో ఏపుగా పెరిగిన ముల్ల కంపలు తన సొంత డబ్బుతో తొలగించటంతో యాడికి కాలువకు నీరు వచ్చిందన్నారు. ఏటా రాయలచెరువు చెరువును నీటితో నింపటంతో చెరువు కూడా మరువ పారిందన్నారు. గత మూడేళ్లుగా యాడికి కాలువలో నీరు పారుతుండటంతో బోరుబావుల్లో నీటి మట్టం పెరిగిందన్నారు. గత 30 ఏళ్లుగా అధికారంలో ఉన్న జేసీ సోదరులు యాడికి కాలువకు పట్టించుకోక పోవడంతో కాలువ పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేదన్నారు.. జూటూరు వద్ద ఉన్న తమ వ్యవసాయ క్షేత్రానికి నీటిని పెద్దవడుగూరు మండలం నుంచి మళ్లించుకున్నారే తప్ప ఏనాడు వారు అధికారంలో ఉన్నప్పుడు యాడికి కాలువ గూర్చి పట్టించుకోలేదన్నారు. యువగళం పాతయాత్రలో జరిగిన రెడ్ల సమావేశంలో కోనుప్పలపాడు టీడీపీ నేత గోపాల్ రెడ్డి ప్రభుత్వం తమపై కేసులు పెట్టి జైలుకు పంపుతోందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో 15 మంది రెడ్డి కులస్తులపై ఎస్సీ,ఎస్టీ కేసులు పెట్టించింది మీరు కాదా అని ప్రశ్నించారు. యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, శివకేశవరెడ్డి, జగదీశ్వరరెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



మట్టి నమూనా పరీక్షలు చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే రైతులకు పంటసాగులో ఖర్చు తగ్గడంతోపాటు, అధిక దిగుబడులు లభిస్తాయని ఏఓ స్వాతి సూచించారు. కసాపురంలో గురువారం ఏఓ ఆర్బీకే సిబ్బంది, రైతులతో తో కలిసి మట్టి నమూనా సేకరణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంటసాగు చేపట్టిన ప్రతి సారి భూసార పరీక్షలు చేయించడం వల్ల భూమిలో ఉన్న పోషకాల విలువ తెలియడమే కాకుండా ఆ ఏడాది ఏ పంటను సాగు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందో తెలుస్తుందన్నారు.

తాడిపత్రి: సజ్జలదిన్నె ఆర్బీకే పరిధిలోని రైతులు భూ సార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ మహితా కిరణ్ సూచించారు. గురువారం సర్పంచ్ నీరజ, ఆర్బీకే సిబ్బంది, రైతులతో కలసి సమీప పొలాల్లో మట్టి పరీక్షల కోసం నమూనాలు సేకరించారు. ఈసందదర్భంగా పరీక్షల కోసం మట్టిని ఎలా సేకరించాలి అన్న వాటిపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆర్బీకేలో సిబ్బందికి మట్టి పరీక్షల ఆధారంగా ఆయా పొలాలకు వాడవలసిన ఎరువులు, యాజమాన్య పద్ధతులను వివరించారు.

గార్లదిన్నె: రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితే పెట్టుబడి తగ్గించవచ్చని ఏడీఏ వెంకటరాముడు పేర్కొన్నారు. గురువారం గార్లదిన్నె మండలంలో భూసార పరీక్షలకు సంబంధించి మట్టి సేకరణపై ఆర్బీకే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

యాడికి: భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ మహబూబ్‌బాషా అన్నారు. గురువారం రాయలచెరువు ఆర్బీకేలో ఆర్బీకేల సిబ్బందికి మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు.

మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారభేరి



పోస్టర్లు విడుదల చేస్తున్న వామపక్షాల నాయకులు

గుత్తి రూరల్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్షాల ఆధ్వర్యంలో ప్రచారభేరి నిర్వహిస్తున్నట్లు వామపక్షాల నాయకులు రాందాసు, నిర్మల, రామకృష్ణ, రమేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో శుక్రవారం నుంచి ఈ నెల 30 వరకూ సీపీఐ, సీపీఐ(ఎం) చేపట్టనున్న ప్రచారభేరికి సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మతోన్మాద, కార్పొరేట్ అనుకూల, ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టేందుకు ప్రచారభేరిని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం నిర్మాణంపై ద్రోహాన్ని నిరసిస్తామన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలన్నారు. నాయకులు రామచంద్ర, రామాంజనేయులు, రామకృష్ణ, షఫీ, రాజు, మహిళా నేతలు మహమూద బేగం, పార్వతి ప్రసాద్, పద్మావతి పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని సాగనంపుదామని సీపీఐ, సీపీఎం నాయకులు ప్రజలను కోరారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ, సీపీఎం ప్రచారభేరి కరపత్రాలను విడుదల చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సీపీఎం నాయకులు దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిప్పు.. జాగ్రత్తలు లేకుంటే ముప్పే!

- వేసవిలో పెరుగుతున్న ప్రమాదాలు
- గతేడాది 60 అగ్ని ప్రమాదాల ద్వారా రూ 1.80 కోట్ల ఆస్తి నష్టం
- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



అగ్నిమాపక కార్యాలయం

తాడిపత్రి టౌన్ : వేసవి సీజన్ ప్రారంభమైంది. అగ్ని ప్రమాదాల సీజన్ మొదలైంది. అగ్ని ప్రమాదాలపై నివారణపై అవగాహన కార్యక్రమాలను శుక్రవారం నుంచి ఈనెల 20 వరకూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది. అగ్నిమాపక వారోత్సవాల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహ కల్పించడం ద్వారా ఆస్తి నష్టం నివారించేందుకు అగ్నిమాపక అధికారులు చర్యలు చేపట్టనున్నారు. దీంతో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక అధికారులు ప్రజలను తెలియజేస్తున్నారు. తాడిపత్రి అగ్నిమాపక కార్యాలయం పరిధిలో మూడేళ్లుగా వివిధ ప్రమాదాల కారణంగా రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. ప్రజల నిర్లక్ష్యం కారణంగా తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

భారీగా ఆస్తినష్టం

తాడిపత్రి అగ్రిమాపక కేంద్ర పరిధిలో తాడిపత్రి పట్టణం , రూరల్, యల్లనూరు, పుట్లూరు, పెద్దపప్పూరు, యాడికి మండలాల పరిధిలోని గ్రామాలు వస్తాయి. గత మూడేళ్లలో జరిగిన ప్రమాదాల ద్వారా కోట్లాది రూపాయల ఆస్తినష్టం వాటిల్లింది. 2020-21లో 55 ప్రమాదాల్లో రూ.70 లక్షలు, 2021 -22లో 54 ప్రమాదాల్లో రూ.60 లక్షలు, 2022-23లో 60 ప్రమాదాల్లో రూ 1.80 కోట్ల ఆస్తి నష్టం వాట్లిందని అగ్నిమాపక శాఖ చెబుతోంది.

విస్తృతంగా అవగాహన

ప్రమాదలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు అగ్నిమాపక శాఖ ఈనెల 14వ తేదీ నుంచి 20 వరకు ఏడు రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. అగ్ని ప్రమాదలు ఎలా జరుగుతాయి ? వాటిని ఎలా అదుపు చేయవచ్చునో మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు తెలియజేయనున్నారు. సిగరెట్టు, బీడీలు తాగి ఎక్కడపడితే అక్కడ పడవేయడం ద్వారా కొన్ని అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ కోరుతోంది.

ఫోన్లో సమాచారమిస్తే చాలు..



తాడిపత్రి అగ్నిమాపక శాఖ పరిధిలో తాడిపత్రి పట్టణం, రూరల్, యాడికి, పెద్దపప్పూరు, యల్లనూరు, పుట్లూరు మండలాల పరిధిలోని గ్రామాలు వస్తాయి. చిన్నపాటి అగ్ని ప్రమాదం జరిగినా వెంటనే 101కు గానీ, 08558-222299కు ఫోన్‌లో సమాచారం అందించాలి. వెంటనే మా సిబ్బంది వచ్చి అగ్ని ప్రమాద తీవ్రత తగ్గించేందుకు కృషి చేస్తారు. వాహనం కండీషన్ బాగుంది. నీటి సదుపాయం, అధికారులు, సిబ్బంది కొరత లేదు.

–మోహన్‌బాబు, ఫైర్ ఆఫీసర్, తాడిపత్రి

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

గుంతకల్లు రూరల్: అగ్నిమాపక శాఖ వారోత్సవాలను శుక్రవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి కేపీ లింగమయ్య కోరారు. గురువారం స్థానిక ఫైర్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వారోత్సవాల్లో భాగంగా మొదటిరోజు కరపత్రాల విడుదల, తర్వాత రోజుల్లో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, పరిశ్రమలు, ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.